# మనం





## నిజామాబాద్ కామారెడ్డి

గురువారం । 15 । అక్టోబర్ । 2026 పేజీలు: 10


## బోధన్‌లో కల్తీ నూనె తయారీ గుట్టురట్టు



పశువుల కొవ్వు, ఎముకలు, తోళ్లతో కల్తీ నూనె తయారీ...

పోలీసుల మెరుపు దాడి.. 900 లీటర్ల కల్తీ నూనె స్వాధీనం...

ముగ్గురు నిందితులు అదుపులోకి.. మహారాష్ట్రకు కల్తీ నూనె విక్రయాలు!...

3

# భిక్కనూర్‌లో ‘10 వేల పేజీల’ రికార్డులపై ఉత్కంఠ!




**ఈ నెల 26 నుంచి 31 వరకు పరిశీలనకు పంచాయతీ అధికారుల అనుమతి.. త్వరలో వెలుగులోకి రానున్న ఖర్చుల వివరాలు!**

2

భిక్కనూర్, అక్టోబర్ 14 ( మనం న్యూస్ ): గ్రామ పంచాయతీ నిధుల వినియోగం ఖర్చుల వివరాలకు సంబంధించిన సుమారు 10 వేల పేజీల రికార్డుల పరిశీలన వ్యవహారం భిక్కనూర్లో ఆసక్తికరంగా మారింది. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్న గ్రామానికి చెందిన భాస్కర్కు రికార్డుల పరిశీలన చేసుకునేందుకు పంచాయతీ అధికారులు ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఇన్నాళ్లుగా చర్చనీయాంశంగా ఉన్న ‘10 వేల పేజీల’ వ్యవహారంలో అసలు విషయాలు ఏమిటన్న ఉత్కంఠ నెలకొంది.



## ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహారం

- అల్పాహార పథకం అమలుకు ఏర్పాట్లు వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.
- పాల్వంచ మార్కెట్ యార్డులో కేంద్రీకృత వంటశాల.

2

## సమన్వయంతో స్పందించి.. నిండు ప్రాణాన్ని కాపాడిన పోలీసులు!

- డయల్ 112కు వచ్చిన సమాచారంతో తక్షణ స్పందన.
- ఫోన్లో ధైర్యం చెబుతూ నివారించిన ఆత్మహత్యాయత్నం.
- దేవునిపల్లి, రామారెడ్డి పోలీసుల సమన్వయంతో బాధితుడికి రక్షణ
- సిబ్బందిని అభినందించిన ఎస్పీ రాజేష్ చంద్ర

2

*కామారెడ్డి, అక్టోబరు 14 (మనం న్యూస్): ఆపదలో ఉన్న వ్యక్తికి సకాలంలో అండగా నిలిచి కామారెడ్డి జిల్లా పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. వ్యక్తిగత సమస్యలతో మనస్తాపానికి గురై రైల్వే ట్రాక్ ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని దేవునిపల్లి, రామారెడ్డి పోలీసులు సమన్వయంతో స్పందించి కాపాడారు. ఫోన్లో ధైర్యం చెబుతూ, సాంకేతిక సమాచారంతో ఆచూకీ గుర్తించి ప్రాణాపాయం నుంచి రక్షించారు.*



# భిక్కనూర్‌లో ‘10 వేల పేజీల’ రికార్డులపై ఉత్కంఠ!

**ఈ నెల 26 నుంచి 31 వరకు పరిశీలనకు పంచాయతీ అధికారుల అనుమతి.. త్వరలో వెలుగులోకి రానున్న ఖర్చుల వివరాలు!**




భిక్కనూర్, అక్టోబర్ 14 ( మనం న్యూస్ ): గ్రామ పంచాయతీ నిధుల వినియోగం ఖర్చుల వివరాలకు సంబంధించిన సుమారు 10 వేల పేజీల రికార్డుల పరిశీలన వ్యవహారం భిక్కనూర్లో ఆసక్తికరంగా మారింది. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్న గ్రామానికి చెందిన భాస్కర్కు రికార్డుల పరిశీలన చేసుకునేందుకు పంచాయతీ అధికారులు ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఇన్నాళ్లుగా చర్చనీయాంశంగా ఉన్న ‘10 వేల పేజీల’ వ్యవహారంలో అసలు విషయాలు ఏమిటన్న ఉత్కంఠ నెలకొంది.

**ఏడు నెలల నిధుల లెక్కలపై ఆరా!**

భిక్కనూర్ గ్రామ పంచాయతీకి సంబంధించి గత ఏడు నెలల కాలానికి వచ్చిన నిధులు, చేసిన ఖర్చులు, ఇతర ఆర్థిక లావాదేవీల వివరాలను తెలుసుకునేందుకు భాస్కర్ సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్నారు. దీనికి స్పందించిన పంచాయతీ అధికారులు కోరిన సమాచారం సుమారు 10 వేల పేజీల మేరకు ఉండటంతో వాటి ప్రతుల కోసం దాదాపు రూ.20 వేల ఖర్చవుతుందని సమాధానం ఇచ్చినట్లు సమాచారం.

అయితే అంత పెద్ద మొత్తాన్ని చెల్లించి అన్ని పేజీల ప్రతులు తీసుకోవాల్సిన అవసరం లేదని భావించిన దరఖాస్తుదారుడు తనకు అవసరమైన పత్రాలను ఎంపిక చేసుకునేందుకు అసలు రికార్డులను పరిశీలించే అవకాశం కల్పించాలని కోరుతూ మరో సారి దరఖాస్తు చేసుకున్నారు. దీనికి అధికారులు అనుమతి ఇవ్వడంతో రికార్డుల పరిశీలనకు మార్గం సుగమమైంది.

**పరిశీలన తర్వాతే అసలు విషయాలు!**

ఈ నెల 26 నుంచి 31వ తేదీలలో ఏదైనా ఒక రోజు రికార్డులను పరిశీలించిన అనంతరం వాటిలో గుర్తించిన వాస్తవాలను గ్రామ ప్రజలకు తెలియజేస్తానని దరఖాస్తుదారుడు భాస్కర్ వెల్లడించినట్లు తెలిసింది. దీంతో గ్రామ పంచాయతీకి వచ్చిన నిధులు ఏయే పనులకు ఖర్చయ్యాయి? ఖర్చులకు సంబంధించిన బిల్లులు, వోచర్లు, ఇతర ఆధారాలు ఏమి చెబుతున్నాయి? రికార్డుల్లో ఏవైనా అసంగతతలు ఉన్నాయా? అనే అంశాలపై గ్రామస్థుల్లో ఆసక్తి పెరుగుతోంది.

అయితే రికార్డుల పరిశీలన పూర్తయ్యే వరకు ఎలాంటి అవకతవకలు జరిగినట్లు నిర్ధారించలేం. పత్రాల్లో ఉన్న వివరాలు, సంబంధిత ఆధారాల పరిశీలన అనంతరమే వాస్తవాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.

**గ్రామంలో చర్చనీయాంశంగా మారిన వ్యవహారం!**

సుమారు 10 వేల పేజీల రికార్డుల వెనుక ఉన్న వివరాలు ఏమిటి? ఏడు నెలల నిధుల లెక్కల్లో ఎలాంటి సమాచారం బయటపడనుంది? ప్రజాధనం వినియోగంపై ఎలాంటి వాస్తవాలు వెలుగులోకి రానున్నాయి? అన్న ప్రశ్నలు స్థానికంగా చర్చకు దారితీస్తున్నాయి. మొత్తానికి భిక్కనూర్ గ్రామ పంచాయతీకి సంబంధించిన ఈ రికార్డుల పరిశీలనపై గ్రామస్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నెల 26 నుంచి 31 తారీకు మధ్యలో పరిశీలనతో ‘10 వేల పేజీల’ ప్రశ్నకు సమాధానం దొరుకుతుందా? గ్రామ పంచాయతీ ఖర్చుల లెక్కల్లో దాగి ఉన్న వివరాలు బయటపడతాయా? అన్నది వేచి చూడాలి.

# సమన్వయంతో స్పందించి.. నిండు ప్రాణాన్ని కాపాడిన పోలీసులు!

**- డయల్ 112కు వచ్చిన సమాచారంతో తక్షణ స్పందన.**
**- ఫోన్లో ధైర్యం చెబుతూ నివారించిన ఆత్మహత్యాయత్నం.**
**- దేవునిపల్లి, రామారెడ్డి పోలీసుల సమన్వయంతో బాధితుడికి రక్షణ**
**- సిబ్బందిని అభినందించిన ఎస్పీ రాజేష్ చంద్ర.**



కామారెడ్డి, అక్టోబరు 14 (మనం న్యూస్): ఆపదలో ఉన్న వ్యక్తికి సకాలంలో అండగా నిలిచి కామారెడ్డి జిల్లా పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. వ్యక్తిగత సమస్యలతో మనస్తాపానికి గురై రైల్వే ట్రాక్ ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని దేవునిపల్లి, రామారెడ్డి పోలీసులు సమన్వయంతో స్పందించి కాపాడారు. ఫోన్లో ధైర్యం చెబుతూ, సాంకేతిక సమాచారంతో ఆచూకీ గుర్తించి ప్రాణాపాయం నుంచి రక్షించారు. పోసానిపేట్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వ్యక్తిగత సమస్యలతో తీవ్ర మనోవేదనకు గురయ్యారు. జీవితంపై విరక్తి చెంది అడ్లూరు శివారులోని రైల్వే ట్రాక్ ఆత్మహత్యకు యత్నిస్తున్నట్లు డయల్ 112కు సమాచారం అందింది. దీంతో దేవునిపల్లి పోలీస్ సిబ్బంది పీసీ రమేష్, హెచ్జీ భూపతి వెంటనే అప్రమత్తమయ్యారు.

**ఫోన్లో ధైర్యం చెబుతూ..**

బాధితుడికి ఫోన్ చేసి నిరంతరం మాట్లాడుతూ అధైర్యపడవద్దని, సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని సముదాయించారు. మరోవైపు రామారెడ్డి పెట్రోల్ కార్ ఏఎస్సై పండరి గౌడ్తో సమన్వయం చేసుకున్నారు. అందుబాటులో ఉన్న సాంకేతిక సమాచారాన్ని ఉపయోగించి బాధితుడు ఉన్న ప్రాంతాన్ని గుర్తించారు. వెంటనే అక్కడికి చేరుకుని ఆత్మహత్యాయత్నాన్ని విరమింపజేశారు. అనంతరం రామారెడ్డి పెట్రోల్ కార్ సిబ్బంది సహకారంతో బాధితుడిని సురక్షితంగా ఇంటికి చేర్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సకాలంలో స్పందించి ప్రాణాన్ని కాపాడిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర, డీఎస్పీ మధుసూదన్ ప్రత్యేకంగా అభినందించారు.




**జీవితం విలువైనది: ఎస్పీ**

జీవితం ఎంతో విలువైనది, వ్యక్తిగత సమస్యలు, ఒత్తిళ్లతో కుంగిపోకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆత్మీయులతో మనసులోని బాధను పంచుకోవాలని ఎస్పీ సూచించారు. ఆత్మహత్య ఏ సమస్యకూ పరిష్కారం కాదన్నారు. చుట్టుపక్కల ఎవరైనా ఆత్మహత్య ఆలోచనలతో బాధపడుతుంటే వారికి ధైర్యం చెప్పి అవసరమైన సహాయం అందించాలని కోరారు. ఆపదలో ఉన్నవారు తక్షణ సహాయం కోసం ఎప్పుడైనా డయల్ 112కు ఫోన్ చేయవచ్చని, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం అందుబాటులో ఉంటుందని తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహారం



**- అల్పాహార పథకం అమలుకు ఏర్పాట్లు వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.**
**- పాల్వంచ మార్కెట్ యార్డులో కేంద్రీకృత వంటశాల.**

కామారెడ్డి, అక్టోబరు 14(మనం న్యూస్): ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాల్లో విద్యార్థులకు అల్పాహారం అందించే పథకం అమలుకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో పథకం అమలు, ఆహార తయారీ, సరఫరా, మౌలిక సదుపాయాల కల్పనపై సమీక్షించారు. జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో ప్రాథమిక పూర్వ విద్య నుంచి 12వ తరగతి వరకు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారాన్ని సకాలంలో అందించేందుకు అవసరమైన వసతులను ముందుగానే సిద్ధం చేయాలన్నారు.

**ఏడు రోజుల్లో గోదాం ఖాళీ చేయాలి: కలెక్టర్**

పాల్వంచ వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాంలో కేంద్రీకృత వంటశాల ఏర్పాటు చేసే అంశంపై సమావేశంలో చర్చించారు. ప్రస్తుతం గోదాంలో నిల్వ ఉన్న ధాన్యాన్ని ఏడు రోజుల్లోగా ఖాళీ చేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వంటశాల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని సిద్ధం చేసి, తదుపరి పనులకు మార్గం సుగమం చేయాలన్నారు.

**శాఖల మధ్య సమన్వయంతో పనులు పూర్తి చేయాలి**

ఆహార పదార్థాల తయారీ, సరఫరా వ్యవస్థల ఏర్పాటుతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పౌర సరఫరాలు, విద్య, మార్కెటింగ్ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి పథకం అమలులో జాప్యం జరగకుండా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బోధన్లో కల్తీ నూనె తయారీ గుట్టురట్టు

**పశువుల కొవ్వు, ఎముకలు, తోళ్లతో కల్తీ నూనె తయారీ...**
**పోలీసుల మెరుపు దాడి.. 900 లీటర్ల కల్తీ నూనె స్వాధీనం...**
**ముగ్గురు నిందితులు అదుపులోకి..**
**మహారాష్ట్రకు కల్తీ నూనె విక్రయాలు!...**



బోధన్,అక్టోబర్ 14 (మనం న్యూస్): బోధన్ పట్టణంలోని గాంధీనగర్ ప్రాంతంలో కల్తీ నూనె తయారీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పశువుల కొవ్వు, ఎముకలు, తోళ్లను ఉపయోగించి అక్రమంగా నూనె తయారు చేస్తూ ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారన్న సమాచారం మేరకు చీతా ఫోర్స్, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భారీ మొత్తంలో 900 లీటర్ల కల్తీ నూనెను స్వాధీనం చేసుకోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

**పశువుల కొవ్వు, ఎముకలతో కల్తీ నూనె తయారీ!.,**

బోధన్ పట్టణంలోని గాంధీనగర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ సోఫిఉద్దీన్ నివాసంలో కల్తీ నూనె తయారు చేస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా పశువుల కొవ్వు, ఎముకలు, తోళ్లను వేడి చేసి వాటి నుంచి నూనెను తయారు చేస్తున్నట్లు గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ విధంగా తయారు చేసిన నూనెను అక్రమంగా విక్రయిస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు.

ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే అవకాశం ఉన్న కల్తీ నూనె తయారీ వ్యవహారంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నూనెను ఎక్కడెక్కడ విక్రయిస్తున్నారు? దీని తయారీ వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణాల్లో వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

**మహారాష్ట్రకు కల్తీ నూనె విక్రయాలు!.,**

పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, ఇక్కడ తయారు చేస్తున్న కల్తీ నూనెను మహారాష్ట్రకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఈ నూనెను ఎవరికి సరఫరా చేస్తున్నారు? ఏయే ప్రాంతాలకు తరలిస్తున్నారు? ఎంతకాలంగా ఈ అక్రమ వ్యాపారం కొనసాగుతోంది? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగించాల్సి ఉంది. కల్తీ నూనె సరఫరా వ్యవస్థపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

**900 లీటర్ల కల్తీ నూనె స్వాధీనం..**
**ముగ్గురు అదుపులోకి...**

ఈ దాడిలో పోలీసులు 900 లీటర్ల కల్తీ నూనెను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి మహమ్మద్ సఫీఉద్దీన్, మహమ్మద్ సోఫిఉద్దీన్, అబ్దుల్ అన్వర్లను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

కల్తీ నూనె తయారీకి ఉపయోగించిన ముడి పదార్థాలు, తయారీ విధానం, నూనె విక్రయాల వెనుక ఉన్న ఇతర వివరాలపై దర్యాప్తు ద్వారా మరిన్ని విషయాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

**కల్తీ ఉత్పత్తులపై కఠిన చర్యలు: పోలీసులు**

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ కల్తీ ఉత్పత్తులను తయారు చేసినా, విక్రయించినా, అక్రమంగా నిల్వ ఉంచినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ప్రజలకు హాని కలిగించే అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఈ దాడిలో చీతా ఫోర్స్ ఎస్ఐ శ్రీను, ఆయన బృందం, బోధన్ ఎస్ఐ రామ్తో పాటు స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడలకు విద్యార్థి ఎంపిక

సదాశివనగర్, అక్టోబర్ 14(మనం న్యూస్): జిల్లాస్థాయి ఖోఖో క్రీడలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సదాశివనగర్ మండలం మర్కల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రచన రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడలకు ఎంపికయ్యిందని ప్రధాన ఉపాధ్యాయులు కిరణ్ ప్రసాద్ తెలిపారు.జిల్లాస్థాయి ఖోఖో ఎంపిక పోటీల్లో రచన ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు.ఈనెల 15నుంచి 17వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్ నిర్వహించే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటుందన్నారు.రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థిని సర్పంచ్ కుంట ప్రియాంకసుభాష్ అభినందించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని,దానికి ఈ విద్యార్థిని సాధించిన విజయమే నిదర్శనమని కొనియాడారు.చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమన్నారు.క్రీడలు శారీరక దృఢత్వానికే కాకుండా,మానసిక ఉల్లాసానికి,క్రమశిక్షణకు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు అస్మ బేగం,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మహిపాల్ తండాలో ఇద్దరు లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ



సిరికొండ రూరల్,అక్టోబర్ 14 (మనం న్యూస్): పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా సిరికొండ మండలం జగదాంబ తాండా పరిధిలోని మహిపాల్ తండాలో ఇద్దరు లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించారు.

ఎమ్మెల్యే భూపతి రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ మాలవత్ సుగుణ ఆధ్వర్యంలో లబ్ధిదారులు భుక్య స్రవంతి, బాబు రావు ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు రవి నాయక్ పాల్గొని ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో మహిపాల్, వెంకటేష్, శంకర్ నాయక్, పంచాయతీ కార్యదర్శి పాషా తదితరులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా తమ సొంతింటి కల నెరవేరుతున్నందుకు లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ఇళ్ల నిర్మాణానికి అవకాశం కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే భూపతి రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

## భూభారతి రీ-సర్వేపై పెద్దవాల్గోట్‌లో అవగాహన సదస్సు

**గ్రామసభలో పాల్గొన్న భూ రికార్డుల అధికారులు, ప్రజాప్రతినిధులు**



సిరికొండ రూరల్, అక్టోబర్ 14 (మనం న్యూస్): నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామం భూభారతి పథకం కింద భూముల రీ-సర్వేకు ఎంపికైంది. ఈ నేపథ్యంలో బుధవారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్రామసభ నిర్వహించి, భూభారతి భూముల రీ-సర్వే ప్రక్రియపై గ్రామస్తులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, డీఐ, తహసీల్దార్ ఆర్ రవీందర్ రావు, ఎంపీడీవో అహ్మద్ రఫీ, నాయబ్ తహసీల్దార్ ఏ గంగాధర్, ఆర్ ఐ నాగన్న పాల్గొని రీ-సర్వే ప్రక్రియకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. భూముల వివరాలు, రికార్డుల పరిశీలన, సర్వే ప్రక్రియకు సంబంధించి గ్రామస్తులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిట్ల వనిత నర్సింగ్, ఉపసర్పంచ్ రాములు, సర్వే బృందానికి చెందిన అంజలి, సిరికొండ మండల సర్వేయర్ రంజిత్, గ్రామ పాలనాధికారి కొత్వాల నవీన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) సభ్యులు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



భూభారతి రీ-సర్వే ప్రక్రియలో గ్రామస్తుల భాగస్వామ్యం కీలకమని అధికారులు పేర్కొన్నారు. గ్రామసభ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు



## ప్రతి ఒక్కరు కుటుంబ నియంత్రణ పాటించాలి

మద్నూర్:(అక్టోబర్ - 14) మనం -న్యూస్ :మద్నూర్ మండలంలో ప్రతి ఒక్కరు కుటుంబ నియంత్రణను పాటించాలి లని మద్నూర్ మండల అభివృద్ధి అధికారి సాయిలు సూచించారు . మద్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం ఎంపీడీవో సాయిలు సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆనంద్ జాదవ్ తో సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కామారెడ్డి జిల్లాలో ఉత్తమ ఆసుపత్రిగా ఉందని కొనియాడారు. జిల్లాలో కామారెడ్డి తర్వాత కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరుగుతున్న ఏకైక మద్నూర్ ఆసుపత్రి అని పేర్కొన్నారు.

# చిన్న కోతలతో ఖచ్చితమైన క్యాన్సర్ చికిత్సలు

- యశోద ఆసుపత్రిలో రోబోటిక్, లాపరోస్కోపిక్ విధానాలతో అధునాతన వైద్యం.
- క్యాన్సర్ ముప్పునకు జీవనశైలే కీలకం! పొగాకు, మద్యపానంతో పెరుగుతున్న ప్రమాదాలు.
- యశోద ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ రోబోటిక్ ఆంకో సర్జన్ డాక్టర్ వై. యుగంధర్ రెడ్డి.



కామారెడ్డి, అక్టోబరు 14 (మనం న్యూస్): క్యాన్సర్ చికిత్సలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, రోగుల ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా ఖచ్చితమైన వైద్య సేవలు అందించడంపై యశోద ఆసుపత్రి దృష్టి సారిస్తోంది. సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో రోబోటిక్, లాపరోస్కోపిక్ వంటి మినిమల్లీ ఇన్వేసివ్ విధానాలతో పాటు సర్జికల్, మెడికల్, రేడియేషన్ ఆంకాలజీ నిపుణుల సమన్వయంతో క్యాన్సర్ చికిత్సలు అందిస్తున్నారు. క్యాన్సర్ శస్త్రచికిత్సలో ఆధునిక లాపరోస్కోపిక్, రోబోటిక్ సహాయక విధానాలు కీలక పురోగతిగా నిలుస్తున్నాయి. ఈ పద్ధతుల్లో చిన్న కోతల ద్వారా శస్త్రచికిత్సలు నిర్వహించే అవకాశం ఉంటుంది. అధునాతన సాంకేతికత సాయంతో వైద్యులు శరీరంలోని ప్రభావిత ప్రాంతాన్ని స్పష్టంగా పరిశీలిస్తూ, అవసరమైన చోట మరింత ఖచ్చితత్వంతో శస్త్రచికిత్స చేయగలుగుతున్నారు. గ్యాస్ట్రోఇంటెస్టినల్, కొలొరెక్టల్, రొమ్ము, గైనకాలజికల్ తదితర క్యాన్సర్ల చికిత్సలో రోగి పరిస్థితిని బట్టి ఈ విధానాలను వినియోగిస్తున్నారు. క్యాన్సర్ కణితులను తొలగించడంతోపాటు సాధ్యమైనంత వరకు ఆరోగ్యకరమైన కణజాలాన్ని కాపాడటం, శరీర అవయవాల పనితీరును పరిరక్షించడం, రోగులు త్వరగా కోలుకునేలా చూడటం ఈ చికిత్సా విధానాల ప్రధాన లక్ష్యాలని ఆసుపత్రి వైద్యులు పేర్కొంటున్నారు.

## రోగి అవసరాలకు అనుగుణంగా చికిత్స

క్యాన్సర్ చికిత్సలో ప్రతి రోగి ఆరోగ్య పరిస్థితి, వ్యాధి దశ, కణితి ఉన్న ప్రదేశం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని చికిత్సా ప్రణాళిక రూపొందించడం ముఖ్యమని సోమాజిగూడ యశోద ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ ఆంకాలజీ, లాపరోస్కోపిక్, రోబోటిక్ ఆంకో సర్జన్ డాక్టర్ వై. యుగంధర్ రెడ్డి తెలిపారు. ఆధునిక వైద్య విధానాలు క్యాన్సు సమర్థవంతంగా పోరాడటంతోపాటు రోగుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి దోహదపడుతున్నాయని వివరించారు. మల్టీడిసిప్లినరీ విధానంలో వివిధ విభాగాల నిపుణులు కలిసి రోగి పరిస్థితిని సమీక్షించి చికిత్సపై నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. రోబోటిక్, లాపరోస్కోపిక్ పద్ధతులు ఎంపిక చేసిన క్లిష్టమైన క్యాన్సర్ శస్త్రచికిత్సల్లో మరింత ఖచ్చితత్వానికి తోడ్పడతాయని తెలిపారు.

## వ్యాధి నిర్ధారణ నుంచి తదుపరి సంరక్షణ వరకు

క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ, చికిత్సా ప్రణాళిక, అధునాతన శస్త్రచికిత్సలు, తదుపరి వైద్య సంరక్షణ వరకు సమగ్ర సేవలు అందించడంపై ఆసుపత్రి దృష్టి సారిస్తోంది. రోగి అవసరాలకు ప్రాధాన్యమిస్తూ నిపుణుల సమన్వయం, ఆధునిక సాంకేతికతతో మెరుగైన చికిత్సా అవకాశాలను అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. అయితే, ప్రతి రోగికి రోబోటిక్ లేదా లాపరోస్కోపిక్ శస్త్రచికిత్సలు అనుకూలంగా ఉండవని, క్యాన్సర్ రకం, వ్యాధి దశ, రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి వైద్యులు తగిన చికిత్సా విధానాన్ని నిర్ణయిస్తారని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

## క్యాన్సర్ ముప్పునకు జీవనశైలే కీలకం!

క్యాన్సర్ ముప్పును పెంచే అంశాలపై అవగాహన అవసరం. శరీరంలోని కణాల పెరుగుదలపై నియంత్రణ కోల్పోయినప్పుడు క్యాన్సర్ అభివృద్ధి చెందుతుంది. వయస్సు, కుటుంబ చరిత్ర వంటి కొన్ని అంశాలను మార్చలేకపోయినా.. జీవనశైలిలో మార్పులతో ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చు.

## ధూమపానం, గుట్కా, జర్దాల వినియోగం

ధూమపానం, గుట్కా, జర్దా వంటి పొగాకు ఉత్పత్తుల వినియోగం నోరు, గొంతు, ఊపిరితిత్తులు సహా పలు అవయవాల క్యాన్సర్ల ప్రమాదాన్ని పెంచుతుంది. మద్యపానం కూడా నోరు, అన్నవాహిక, కాలేయం, పెద్దపేగు, రొమ్ము క్యాన్సర్లతో సంబంధం కలిగి ఉంటుంది. అధిక బరువు, వ్యాయామం లేకపోవడం, వాయు కాలుష్యం, కొన్ని పారిశ్రామిక రసాయనాలకు గురికావడం కూడా ప్రమాద కారకాలుగా ఉన్నాయి.

## కుటుంబంలో క్యాన్సర్ చరిత్ర

కుటుంబంలో క్యాన్సర్ చరిత్ర ఉన్నవారు వైద్యుల సలహాతో తగిన పరీక్షలు చేయించుకోవాలి. హెచ్పీవీ, హెపటైటిస్-బి వంటి వైరస్లకు సంబంధించిన కొన్ని క్యాన్సర్లను టీకాల ద్వారా నివారించే అవకాశం ఉంది. క్యాన్సర్ పూర్తిగా రాకుండా అడ్డుకోవడం సాధ్యం కాకపోయినా.. ముందస్తు జాగ్రత్తలతో ముప్పును తగ్గించుకోవచ్చు.

---



# పిరమిడ్ నిర్మాణం కోసం భూమి పూజ

బోధన్ అక్టోబర్ 14(మనం న్యూస్): నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం జలాల్ పూర్ గ్రామంలో మహతి ఆశ్రమం వద్ద నూతనంగా నిర్మించనున్న దుర్గమ్మ ధ్యాన పిరమిడ్ కు బుధవారం భూమి పూజ చేశారు

ఈ యొక్క పిరమిడ్ ధ్యాన మందిర నిర్మాణ కర్తలు శ్రీమతి శ్రీ అమరవాజీ స్వరూప నరేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్మించడం జరుగుతుంది. భూమి పూజ కార్యక్రమాన్ని

అమృతధార ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీశ్రీశ్రీ హరా చారి నారాయణ స్వామి గారు భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు

ఆత్మీయ విశిష్ట అతిథి గా హాజరైన పిఎస్ఎస్ యం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయి కృష్ణారెడ్డి మాస్టారు ఈ సందర్భంగా భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టినారు ఈ సందర్భంగా సాయి కృష్ణ రెడ్డి మాట్లాడుతూ

పిరమిడ్లు గొప్ప శక్తి క్షేత్రాలని పిరమిడ్ ధ్యాన మందిరంలో ధ్యానం చేయడం వల్ల అనంతమైన విశ్వశక్తి లభిస్తుందని ప్రతి ఒక్కరూ విశ్వంలో ఉన్న అనంతమైన విశ్వమయ ప్రాణ శక్తిని ఉపయోగించుకొని పిరమిడ్ ధ్యాన మందిరాలలో ధ్యానం చేసి ఆనందంగా జీవించాలనీ అన్నారు

ఈ కార్యక్రమంలో శ్రీమతి శ్రీ భోగరాజు నిర్మల మహతి ఆశ్రమం అధ్యక్షురాలు గ్రామ సర్పంచ్ గుండేటి మోహన్ రెడ్డిమాజీ సర్పంచ్ శ్రీ అనిల్ కుమార్ శ్రీ హరాచారి హరి ఉప సర్పంచ్ మూగ భోజన్న

పి యస్ యస్ యం నిజామాబాద్ జిల్లా కార్యదర్శి డాక్టర్ అమరవాజి శ్రీనివాస్ గౌరవ సలహాదారులు సింధుల రాజేందర్దేవేందర్ రెడ్డి పిరమిడ్ మాస్టర్లు కొత్త పల్లి రాజిరెడ్డిబాలసాయి తదితరులు పాల్గొన్నారు

# శరన్నవరాత్రి ఉత్సవాల్లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం



## భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 14 (మనం న్యూస్): సిరికొండ మండల కేంద్రంలో గల శ్రీలంక రామలింగేశ్వర ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించి, లోకకల్యాణం కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నసత్రం ఏర్పాటు చేసి అన్నదానం నిర్వహించారు.

ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకలని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. పండుగల సందర్భంగా అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సేవాభావం, ఐక్యత పెంపొందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



# ప్రతి పంచాయతీలో 60 మంది కూలీలకు ఉపాధి కల్పించాలి: కలెక్టర్

- కూలీల హాజరుపై రోజువారీ పర్యవేక్షణ, ఉపాధి పనుల లక్ష్యాల సాధనకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశం.
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు 90 రోజుల వేతన ఉపాధి, రెండో విడత ఇళ్లకు కొత్త అంచనాలు త్వరగా రూపొందించాలి.



కామారెడ్డి, అక్టోబరు 14(మనం న్యూస్): జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు సగటున 60 మంది కూలీలకు ఉపాధి కల్పించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు, కూలీల హాజరు, మేటీల నియామకం, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు వేతన ఉపాధి కల్పన, రెండో విడత ఇళ్లకు కొత్త అంచనాల తయారీపై బుధవారం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీలు, ఆవాసాల్లో ఉపాధి పనులు ప్రారంభించి, పని కోరే కుటుంబాలకు నిరంతరం పనులు కల్పించాలని సూచించారు. అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమయపాలన పాటిస్తూ లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు.

## ఉదయమే పనుల వద్దకు చేరాలి

అదనపు కార్యక్రమ అధికారులు, ఇంజినీరింగ్ సలహాదారులు, సాంకేతిక సహాయకులు ఉదయం 8 గంటలకల్లా విధులకు హాజరై పనులు జరిగే ప్రాంతాలను పరిశీలించాలని ఆదేశించారు. క్షేత్ర సహాయకులు, మేటీలు ఉదయం 7 గంటలకే చేరుకొని కూలీలను సమీకరించాలన్నారు. కూలీల హాజరు తక్కువగా నమోదవుతున్న మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి, రోజువారీగా పురోగతిని సమీక్షించాలని సూచించారు.

## ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రాధాన్యం

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉపాధి హామీ పథకం ద్వారా 90 రోజుల వేతన ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణ, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో అర్హులను గుర్తించాలని సూచించారు. రెండో విడతలో మంజూరైన ఇళ్లకు సంబంధించి పనులు గుర్తించి, కొత్త అంచనాలను నిర్ణీత గడువులోగా సిద్ధం చేయాలని ఆదేశించారు. మేటీల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ ఉపాధి పనులు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దామోదర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ అధికారి విజయ్ పాల్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మురళి, సీఈఓ చందర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## భీమ్గల్ విద్యానగర్ కాలనీలో దుర్గాదేవి యజ్ఞ, అన్న సత్రం కార్యక్రమం

భీమ్గల్ ,అక్టోబర్ 14 ( మనం న్యూస్): మంగళవారం భీమ్గల్ లోని విద్యానగర్ లో అమ్మవారికి యజ్ఞం పూజ ,అన్నసత్రం కార్యక్రమం నిర్వహించారు. మొదటి సారి విద్యానగర్ లో అమ్మవారిని ఏర్పాటు చేయడం జరిగిందని కమిటీ సభ్యులు తెలియజేశారు.

ప్రతి ఇంటి నుండి మహిళలు ఉదయం సాయంత్రం పూజ,హారతి ,నైవేద్య కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారని వారు తెలియజేశారు. ముఖ్యంగా ఈ కాలనీలో ఉన్న వారు అందరూ దాదాపు వివిధ ప్రాంతాలనుండి వ్యాపార ఉద్యోగ రీత్యా ఇక్కడ స్థిరపడినవారు అవ్వడం విశేషం.అయినప్పటికీ అందరూ సమష్టిగా అమ్మవారి నవరాత్రుల కార్యక్రమం నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నారు అని కమిటీ సభ్యులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో భీమ్గల్ మున్సిపల్ చైర్ పర్సన్ నాగమణి స్వామి,వైస్ చైర్ పర్సన్ లత నర్సన్న,కౌన్సిలర్ పర్సా కుశలత అనంతరావు ,కమిషనర్ గజానంద్ ,మున్సిపల్ సిబ్బంది ,విద్యానగర్ పెద్దలు రాజేశ్వర్ ,హరి,మోహన్,రెడ్డి,పవన్, రమేష్,దాసు,సాయన్న,భూమేష్ ,మహిళలు పాల్గొన్నారు.



## ఆర్మూర్ అయ్యప్ప ఆలయంలో మాస పూజలు

ఆర్మూర్,అక్టోబర్ 14(మనం న్యూస్): ఆర్మూర్,యువత పెడదారి పట్టకుండా భక్తి భావనతో సన్మార్గంలో నడిచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, అన్నారు. బుధవారం ఆర్మూర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో జంబి హనుమాన్ ఆలయ ప్రాంగణంలోని అయ్యప్ప ఆలయంలో నిర్వహించిన మాస పూజలు, అన్న వితరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని అన్న వితరణను ప్రారంభించారు. ప్రతినెలా రెండవ బుధవారం మాస పూజలతో పాటు అన్నదానం నిర్వహించడం అభినందనీయమని సేవా సమితి సభ్యులను ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు పుట్టి మురళి, కార్యదర్శి మీసాల రవి, కోశాధికారి గాజారెడ్డి నర్సారెడ్డి, సహాయ కోశాధికారి షేర్ ఒడ్డెన్న, గౌరవ అధ్యక్షులు జనార్దన్ గౌడ్, పెంట జలంధర్, గంగాధర్ గౌడ్, మీసాల రాజేశ్వర్, జన్నపల్లి రంజిత్, ద్యాగ ఉదయ్, నూతుల శ్రీనివాస్, యోగేష్, కొటిక విజయ్, నరేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ కాటిపల్లి వెంకటరెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ నరేందర్, డీఈ భరత్, గురుస్వాములు నగేష్ శర్మ, మామిడిపల్లి ప్రభు దత్తు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్‌లో సిరికొండ విద్యార్థినుల సత్తా

**ఈ పోటీలలో విజేతగా నిజామాబాద్ జిల్లా జట్టు**

**యుగేశ్వరి, మేఘనకు బంగారు పతకాలు.. జిల్లాకు గర్వకారణం**

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 14 (మనం న్యూస్): రాష్ట్రస్థాయి సాఫ్ట్బాల్ పోటీల్లో సిరికొండ మండలానికి చెందిన విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 11, 12 తేదీల్లో నిజామాబాద్ జిల్లా సాఫ్ట్బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 11వ రాష్ట్రస్థాయి మినీ సబ్జూనియర్ (అండర్-13) బాలికల సాఫ్ట్బాల్ పోటీల్లో నిజామాబాద్ జిల్లా జట్టు బంగారు పతకం సాధించింది. సిరికొండ మండలంలోని సత్యశోధక్ పాఠశాలకు చెందిన ఏ. యుగేశ్వరి, ఎం. మేఘన ప్రతిభ చాటారు.

నిజామాబాద్ జిల్లా జట్టు తరఫున బరిలోకి దిగిన ఈ విద్యార్థినులు జట్టు విజయానికి కీలకంగా నిలిచి బంగారు పతకాలు సాధించడం విశేషం. పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న వీరు రాష్ట్రస్థాయిలో సత్తా చాటి జిల్లాకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సాఫ్ట్బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి శోభన్బాబు, జక్రాన్పల్లి ఎంఈఓ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. గంగమోహన్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి గంగాధర్ తదితరులు బంగారు పతక విజేతలను అభినందించారు.

విద్యార్థినులు సాధించిన విజయంపై సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఆర్. నర్సయ్య హర్షం వ్యక్తం చేశారు. క్రీడాకారిణులను ప్రత్యేకంగా అభినందించడంతో పాటు, వారికి శిక్షణ అందించిన కోచ్లు అనికేత్, అనిల్లను ప్రశంసించారు. పట్టుదల, క్రమశిక్షణతో క్రీడల్లో రాణిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.




## భీంగల్ పట్టణంలో బతుకమ్మ, దసరా పండుగల నిర్వహణ తేదీలు ఖరారు చేసిన పెద్దలు



భీమ్గల్ ,అక్టోబర్ 14 ( మనం న్యూస్): భీమ్గల్ మున్సిపల్ పాలకవర్గం, సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ బుధవారం సమావేశమై వేద పండితుల సలహాతో బతుకమ్మ మరియు విజయదశమి తేదీలను నిర్ణయించడం జరిగింది.

బతుకమ్మ పండుగ: ఈ నెల 17వ తేదీ, శనివారం

దసరా పండుగ: ఈ నెల 20వ తేదీ, మంగళవారం

ఈ పండుగలను పట్టణ ప్రజలందరి భాగస్వామ్యంతో ఐకమత్యంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు.

పండుగల నిర్వహణ విజయవంతం కావడానికి పట్టణ ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ చైర్పర్సన్, పాలకవర్గ సభ్యులు, సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ భాగస్వాములై పరస్పర సోదరభావం, సామాజిక ఐక్యతను చాటాలని కోరారు.

కావున, పట్టణ ప్రజలందరూ పండుగల తేదీలను గమనించి, నిర్వహణకు తమ వంతు సహకారం అందించాలని మున్సిపల్ చైర్పర్సన్ మరియు పాలకవర్గం సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ భీంగల్ విజ్ఞప్తి చేశారు.

# నీళ్లు లేక వెలవెలబోతున్న దాసనమ్మ కుంట!

**బతుకమ్మ నిమజ్జనానికి నీళ్లేవి?**



భిక్కనూర్, అక్టోబర్ 14 ( మనం న్యూస్ ): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేళ చెరువులు, కుంటలు పూల పండుగ సంబరాలతో కళకళలాడాల్సి ఉండగా నీటి లభ్యత లేక వెలవెలబోతున్న దాసనమ్మ కుంట పరిస్థితి స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కుంటలో నీరు లేకపోవడంతో బతుకమ్మ నిమజ్జనం ఎక్కడ చేయాలనే ప్రశ్న ప్రజలను వేధిస్తోంది.

ప్రతి ఏడాది బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహిస్తారు. చివరిరోజు బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేయడం ఈ పండుగలో ముఖ్యమైన సంప్రదాయం. అయితే కుంటల్లో నీరు లేకపోవడంతో నిమజ్జనానికి అనువైన ప్రదేశం కోసం వెతకాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

**నీరు లేకపోతే ఎన్నో కష్టాలు!**

కుంటల్లో నీటి కొరత కేవలం పండుగలకే పరిమితమైన సమస్య కాదు. నీటి నిల్వలు తగ్గిపోతే భూగర్భ జలాలపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. బావులు, బోర్లలో నీటి మట్టాలు తగ్గితే తాగునీటి అవసరాలు తీర్చుకోవడం కష్టమవుతుంది. పశువులకు నీరు అందించడం ఇబ్బందిగా మారుతుంది. పక్షులు, ఇతర జీవులకు తాగునీరు దొరకక ఇబ్బందులు ఎదురవుతాయి. నీటి వనరులు ఎండిపోవడంతో పరిసరాల్లో పచ్చదనం తగ్గి పర్యావరణ సమతుల్యతకు సైతం విఘాతం కలిగే ప్రమాదం ఉంది.

వర్షపు నీటిని నిల్వ చేసుకునే కుంటల్లో నీరు లేకపోతే భవిష్యత్తులో నీటి అవసరాలు మరింత భారంగా మారవచ్చు. కుంటలు నిండుగా ఉంటే భూగర్భ జలాల పెరుగుదలకు, పశుపక్ష్యాదుల మనుగడకు, పరిసరాల పచ్చదనానికి ఉపయోగపడతాయి.

**బతుకమ్మ నిమజ్జనం ఎక్కడ?**

బతుకమ్మ పండుగ మహిళల ఆనందానికి తెలంగాణ సంస్కృతికి ప్రతీక. అలాంటి పండుగ సమయంలో నిమజ్జనానికి నీరు అందుబాటులో లేకపోవడం ప్రజలకు అసౌకర్యాన్ని కలిగిస్తోంది. వృద్ధులు, చిన్నపిల్లలతో వెళ్లే కుటుంబాలకు మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. స్థానికంగా నీటి వసతి లేకపోతే పండుగ సంబరాల మధ్యనే ఈ సమస్య ప్రజలను వెంటాడుతుంది.

**కుంటలు కళకళలాడితేనే పల్లెకు కళ!**

కుంటలు అనేవి కేవలం నీటిని నిల్వ చేసుకునే ప్రదేశాలు మాత్రమే కాదు. అవి గ్రామీణ జీవనానికి, ప్రకృతి పరిరక్షణకు, సంప్రదాయ పండుగలకు కూడా ఎంతో ప్రాధాన్యత కలిగినవి. వర్షపు నీటిని ఒడిసిపట్టే కుంటలు ఎండిపోతే వాటిపై ఆధారపడే జీవజాలంతోపాటు ప్రజలకూ ఇబ్బందులు తప్పవు.

దాసనమ్మ కుంటలో నీరు లేక వెలవెలబోతున్న పరిస్థితి నీటి వనరుల ప్రాధాన్యతను మరోసారి గుర్తుచేస్తోంది. బతుకమ్మ పండుగ వేళ నిమజ్జనానికి నీళ్లేవి అనే ప్రశ్న స్థానికంగా వినిపిస్తోంది. పూల పండుగ సంబరాలు సజావుగా సాగాలంటే నీటి వనరుల ప్రాముఖ్యతను గుర్తించడం అవసరం.

కుంటల్లో నీరు ఉంటేనే పండుగలకు కళ, పల్లెలకు పచ్చదనం, ప్రకృతికి జీవం. నీరు లేని కుంటలను చూస్తూ బతుకమ్మ నిమజ్జనం ఎక్కడ చేయాలనే ప్రశ్న ఎదురవుతున్న వేళ.. దాసనమ్మ కుంటకు పూర్వవైభవం ఎప్పుడొస్తుందో అన్నది స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## రెంజల్ మండలంలోని పదకొండు (11) గ్రామాల్లో దేవీమాత మండపాలకు పట్టు చీరల పంపిణీ

**మండల యువ నాయకుడు, సామాజిక కార్యకర్త నల్ల నవీన్ కుమార్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో సేవా కార్యక్రమం...**



నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రెంజల్ మండలంలోని అన్ని గ్రామాల్లో కొలువుదీరిన ఆ జగన్మాత (దేవి) మాత మండపాలకు మండల యువ నాయకుడు, సామాజిక కార్యకర్త నల్ల నవీన్ కుమార్ ఆధ్వర్యంలో పట్టు చీరలను పంపిణీ చేశారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ, భక్తి భావంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రెంజల్ మండలంలోని రెంజల్, ధూపల్లి, కళ్యాపూర్, నీలా, సాటాపూర్,కూనేపల్లి, బాగేపల్లి, తాడ్ బిలోలి, కందకుర్తి, వీరన్నగుట్ట, వీరన్నగుట్ట తండా గ్రామాల్లోని దేవీమాత మండపాలకు పట్టు చీరలను అందజేశారు. పండుగ వేళ అమ్మవారి మండపాలకు పట్టు చీరలను పంపిణీ చేయడం ద్వారా భక్తి, ఆధ్యాత్మికతతో పాటు గ్రామాల్లో పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చేందుకు తన వంతు సహకారం అందించారు.

గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రోత్సాహం అందిస్తూ, ప్రజలతో మమేకమై సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నల్ల నవీన్ కుమార్ను పలువురు అభినందించారు. దేవీమాత ఆశీస్సులతో గ్రామాలన్నీ సుభిక్షంగా ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

మండలంలోని మొత్తం పదకొండు (11) గ్రామాల్లో దేవీమాత మండపాలకు పట్టు చీరల పంపిణీ చేపట్టడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

## మానసిక రుగ్మతతో వ్యక్తి మృతి బిచ్కుంద వాసిగా గుర్తింపు



బిచ్కుంద అక్టోబర్ 14 మనం న్యూస్ ): మానసిక రుగ్మతతో బిచ్కుంద గ్రామానికి చెందిన నిఖిల్ కమ్మరి చెరువులో పడి మృతి చెందాడు అని పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బిచ్కుంద పోలీస్ స్టేషన్ పరిధిలోని కమ్మరి చెరువులో నిఖిల్ (35) అనే వ్యక్తి మృతదేహం లభించింది. మృతుడు గత కొంతకాలంగా మానసిక రుగ్మతతో బాధపడుతూ నిజామాబాద్, హైదరాబాద్లోని పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు ఫిర్యాదుదారులు పేర్కొన్నట్లు తెలిపారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నిన్న సాయంత్రం 7 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన నిఖిల్ తిరిగి రాకపోవడంతో, ఈరోజు ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి వెతకగా, కమ్మరి చెరువు సమీపంలోని అమరవీరుల స్తూపం వద్ద రోడ్డుపై చెప్పులు కనిపించాయి. అనంతరం చెరువులో నిఖిల్ మృతదేహాన్ని గుర్తించారు. చెరువు వద్దకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడి మృతి చెందినట్లు ఫిర్యాదుదారులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని బిచ్కుంద ఎస్సై రాజు తెలిపారు.

## మహాచండి దేవి అలంకారంలో దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

**వైద్యనాథ్ కాలనీలో నాలుగో రోజు ఉత్సవాలు, పూజల్లో పాల్గొన్న చైర్పర్సన్ ఉమారాణి శ్రీనివాస్.**



కామారెడ్డి, అక్టోబరు 14(మనం న్యూస్): కామారెడ్డి పట్టణ కేంద్రంలోని వైద్యనాథ్ కాలనీలో శ్రీ సింహాసనేశ్వరి దుర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గామాత ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు అమ్మవారిని శ్రీ మహాచండి దేవి అలంకారంలో పూజించారు. మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాలనీవాసులంతా ఐక్యంగా, భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించుకోవడం ఆనందంగా ఉందని ఉమారాణి శ్రీనివాస్ తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీ సింహాసనేశ్వరి దుర్గా ఉత్సవ సమితి సభ్యులు సుధీర్రెడ్డి, కృష్ణారెడ్డి, విష్ణు, లక్ష్మణ్తో పాటు కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.

# ధూపల్లి గ్రామంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్లో ఉచిత వైద్య శిబిరం

**గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ముందడుగు..**
**సర్పంచ్ దనూరి నర్సవ్వ-అబ్బయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం...**



రెంజల్, అక్టోబర్ 14 (మనం న్యూస్): క్షయవ్యాధి (టీబీ) రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా, గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ధూపల్లి గ్రామ సర్పంచ్ దనూరి నర్సవ్వ-అబ్బయ్య ప్రత్యేక చొరవ చూపారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్లో భాగంగా ధూపల్లి గ్రామంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రజల్లో క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తూ, ఆరోగ్య పరీక్షల ప్రాముఖ్యతను తెలియజేసే దిశగా ఈ కార్యక్రమం చేపట్టారు.

**ప్రజారోగ్యానికి పెద్దపీట, సర్పంచ్ ప్రత్యేక చొరవ.,**

గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో గ్రామ సర్పంచ్ దనూరి నర్సవ్వ-అబ్బయ్య పాల్గొని కార్యక్రమానికి ప్రాధాన్యత కల్పించారు. గ్రామస్థులకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం, వ్యాధులపై అవగాహన పెంపొందించడం, ముఖ్యంగా టీబీ లక్షణాలను ముందుగానే గుర్తించి సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకునేలా ప్రజలను చైతన్యపరచడం ఇటువంటి శిబిరాల ప్రధాన ఉద్దేశమని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు.

టీబీ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి తగిన చికిత్స తీసుకోవడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. దగ్గు ఎక్కువ రోజులు కొనసాగడం, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, కారణం లేకుండా బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు.

**వైద్య బృందం సేవలు.. ప్రజలకు అవగాహన.,**

ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ అధికారి డాక్టర్ దేవి నాగేశ్వరి, మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్, రెంజల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సహిస్తా ఫిర్దోస్ పాల్గొన్నారు. అలాగే ఎం.డి. ఆషాన్, లక్ష్మణ్, ఎక్స్రే టెక్నీషియన్ ఎం.ఏ. ఖలీద్, అశోక్, టీ. సురేష్ (హెచ్ఈఓ, పీహెచ్సీ రెంజల్), వి. రాజలక్ష్మి (ఎంపీహెచ్ఏ) వైద్య ఆరోగ్య సిబ్బంది సేవలందించారు.

గ్రామ ఉప సర్పంచ్ కర్రె రాణి, వార్డు సభ్యులు అజయ్ యాదవ్, రఘుపతి లక్ష్మయ్య, గ్రామ కార్యదర్శి సల్మాన్తో పాటు ఆశా కార్యకర్తలు గంగామణి, పద్మ, వసంత, సుమతి, కవిత, కల్పన, శివరజని, ప్రమీల తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రామస్థాయిలోనే వైద్య సేవలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు అందుబాటులోకి రావడం ప్రజలకు ఎంతో ఉపయోగకరం. టీబీ రహిత భారత్ లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ వైద్య సిబ్బంది సూచనలు పాటించాలని కార్యక్రమంలో అవగాహన కల్పించారు...

# హలో మాల - చలో నిజామాబాద్

**ఇందల్వాయిలో ధర్నా పోస్టర్ల ఆవిష్కరించిన మాలల ఉద్యోగ నియామకాల్లో న్యాయం చేయాలి**
**రిజర్వేషన్ల అమలులో మార్పులు చేపట్టాలి**
**అక్టోబర్ 15న నిజామాబాద్లో ధర్నాకు మాల మహానాడు పిలుపు**



నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 12 (మనం న్యూస్): మన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం 1-8-2024 నాడు ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పులోని అంశాలను పరిశీలించకుండా న్యాయ సమీక్ష చేయకుండా ఆశాస్త్రీయంగా అసంబద్ధకంగా 341 ఆర్టికల్ కు విరుద్ధంగా తేదీ 14 - 4 - 2025 ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించి మాలలను మరియు 25 ఉపకులాలను కలిపి గ్రూప్-3 లో చేర్చి 5% రోస్టర్ పాయింట్ లో 22 41 42 77 91వ స్థానాలు కేటాయించారు. ఈ విధానం వల్ల తెలంగాణ రాష్ట్రంలో యావత్ మాల విద్యార్థులకు, విద్యాపరంగా నిరుద్యోగులకు ఉద్యోగపరంగా మరియు ఉద్యోగస్తులకు ప్రమోషన్ పరంగా నష్టపోతున్నారు. మరియు 5% రిజర్వేషన్ ప్రకారం ఉద్యోగాలు ఇవ్వడం లేదు కావున మాల మహానాడు నిజామాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 15న నిజామాబాద్లో ధర్నా నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు, జిల్లా ప్రెసిడెంట్ దేవదాస్ ప్రకటించారు. గురువారం ఉదయం 10 గంటలకు ఎన్టీఆర్ చౌరస్తా సమీపంలోని ధర్నా చౌక్ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

బుధవారం ఇందల్వాయి మండల కేంద్రంలో నిజామాబాద్ రూరల్ ఇన్చార్జి అధ్యక్షుడు తలారి సాయన్న ఆధ్వర్యంలో ధర్నా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు ఈ కార్యక్రమానికి సిరికొండ ధర్పల్లి ఇందల్వాయి డిచ్పల్లి మండలాల అధ్యక్షులు మాల బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



అనంతరం వారు మాట్లాడుతూ..

**రిజర్వేషన్ల అమలులో న్యాయం చేయాలి**

తెలంగాణ రాష్ట్రంలో రిజర్వేషన్ల అమలు, ఉద్యోగ నియామకాల్లో రోస్టర్ పాయింట్ల విధానానికి సంబంధించి మాలలకు న్యాయం జరగాలని మాల మహానాడు నాయకులు కోరుతున్నారు. రిజర్వేషన్ల అమలులో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, తగిన సవరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

**ప్రధాన డిమాండ్లు**

మాల మాల ఉప కులాలకు 5% రిజర్వేషన్ నుండి 8% శాతం పెంచాలి.

రోస్టర్ పాయింట్లను సవరించి మాల మాల ఉపకులాలకు 20 లోపు 2 రోస్టర్ పాయింట్లను కేటాయించాలి.

మాలల రిజర్వేషన్లకు సంబంధించి రోస్టర్ పాయింట్లను సవరించాలని, ప్రస్తుతం అమలవుతున్న విధానంలో మార్పులు తీసుకురావాలని జిల్లా అధ్యక్షులు దేవదాస్, సంఘం నాయకులు కోరుతున్నారు. రోస్టర్ పాయింట్ల సవరణ ద్వారా మాల నిరుద్యోగులు, ఉద్యోగ అభ్యర్థులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ధర్నాను విజయవంతం చేయాలని పిలుపు**

మాలల హక్కుల పరిరక్షణ, ఉద్యోగ నియామకాల్లో న్యాయం సాధించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ ధర్నాకు మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు పాశం నర్సయ్య, ప్రధాన కార్యదర్శి కమ్మరి గంగారం, పాశం ప్రవీణ్ కమ్మరి శివ, బొక్క గంగాధర్, విలేజ్ కమిటీ అధ్యక్షుడు తుమ్మల సత్యం తదితరులు పాల్గొన్నారు.



# అనారోగ్య బాధితురాలికి రూ.2.50 లక్షల ఎల్ఓసీ అందజేత

ఆర్మూర్,అక్టోబర్ 14(మనం న్యూస్): ఆర్మూర్ నియోజకవర్గం అమ్రాద్ తండాకు చెందిన మాలోత్ లక్ష్మీ, అనారోగ్యంతో బాధపడుతూ శస్త్రచికిత్స నిమిత్తం హైదరాబాద్లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. ఆమె వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందించాలని కాంగ్రెస్ నాయకులు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి,ని కోరారు.

వారి విజ్ఞప్తికి స్పందించిన వినయ్ కుమార్ రెడ్డి,, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నిజామాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క సహకారంతో రూ.2,50,000 విలువైన ఎల్ఓసీని మంజూరు చేయించేందుకు కృషి చేశారు. ఈ మేరకు హైదరాబాద్లోని జూబ్లీహిల్స్ కార్యాలయంలో బాధితురాలి కుటుంబ సభ్యులకు ఎల్ఓసీ పత్రాన్ని వినయ్ కుమార్ రెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, మంత్రి ధనసరి అనసూయ సీతక్కలకు బాధితురాలి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

**జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో 15, 16 తేదీల్లో ప్రత్యేక నమోదు శిబిరాలు: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.**

**కొత్త ఓటర్ల కోసం నమూనా-6 ద్వారా దరఖాస్తు, అభ్యంతరాలు, అభ్యర్థనల పరిశీలనకు చర్యలు.**



కామారెడ్డి, అక్టోబరు 14 (మనం న్యూస్): అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం - 2026లో భాగంగా అక్టోబరు 15, 16 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బుధవారం ఓటర్ల జాబితా సవరణ అమలుపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి నోటీసుల జారీ, విచారణల పురోగతిని సమీక్షించి, చేపడుతున్న చర్యలను ప్రతినిధులకు వివరించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు లేని అర్హులైన పౌరులు ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కొత్తగా ఓటు హక్కు పొందేందుకు అర్హత సాధించిన వారు నిర్ణీత నమూనా-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

**అర్హులైన ప్రతి పౌరుడికి ఓటర్ల జాబితాలో చోటు**

ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, వివరాల సవరణకు సంబంధించి అందిన అభ్యర్థనలు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటర్ల జాబితాలో చోటు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి అర్హుడికి ఓటు హక్కు అందేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాలో పేరు ఉందో లేదో పరిశీలించుకుని, నమోదు కానివారు నిర్ణీత గడువులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్, ఎన్నికల అధికారి రాజేశ్వర్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల సంస్మరణార్థం 21 నుంచి 31 వరకు ప్రత్యేక కార్యక్రమాలు

**వివరాలు వెల్లడించిన పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య**




నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 14 (మనం న్యూస్): విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య తెలిపారు.

ఈ సందర్భంగా అక్టోబర్ 20న బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జనసమ్మర్ద ప్రాంతాల్లో అవగాహన బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేయనున్నారు. అక్టోబర్ 21న ఉదయం 8 గంటలకు పోలీస్ హెడ్క్వార్టర్స్లో అమరవీరుల దినోత్సవం నిర్వహిస్తారు. 22న నిజామాబాద్ డివిజన్లో, 24న ఆర్మూర్, బోధన్ డివిజన్లలో అమరవీరుల కుటుంబాలను అధికారులు పరామర్శించనున్నారు.

అక్టోబర్ 23న పోలీసుల సేవలు, అమరవీరుల త్యాగాలపై షార్ట్ ఫిల్మ్, ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తారు. ఆసక్తి గలవారు మూడు ఫోటోలు, మూడు నిమిషాలకు మించని షార్ట్ ఫిల్మ్లు అక్టోబర్ 23 సాయంత్రంలోగా పోలీస్ పీఆర్వోకు అందజేయాలి. ఉత్తమ ఎంట్రీలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారు.

అక్టోబర్ 25న డిచ్పల్లి నుంచి పోలీస్ హెడ్క్వార్టర్స్ వరకు సైకిల్, ద్విచక్ర వాహన ర్యాలీలు నిర్వహించనున్నారు. 26న పోలీసు సిబ్బందికి, 28న పాఠశాల, డిగ్రీ, ఉన్నత విద్య విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలన, సోషల్ మీడియా దుర్వినియోగం అరికట్టడం, ప్రజల మన్ననలు పొందడంలో పోలీసుల పాత్ర వంటి అంశాలపై పోటీలు ఉంటాయి.

అక్టోబర్ 27న నిజామాబాద్ డివిజన్లో, 28న ఆర్మూర్, బోధన్ డివిజన్లలో ఎంపిక చేసిన గ్రామాలు, కాలనీల్లో ప్రజల అవసరాలు, సమస్యలను గుర్తించనున్నారు. 29న పోలీస్ హెడ్క్వార్టర్స్లో రక్తదాన శిబిరం, 30న ఆన్లైన్ ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. అక్టోబర్ 31న గాంధీ చౌక్ నుంచి పోలీస్ పరేడ్ గ్రౌండ్ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించనున్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు ప్రజలకు పోలీసు శాఖ మరింత చేరువ కావడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పోలీస్ కమిషనర్ తెలిపారు. విద్యార్థులు, యువత, పోలీసు సిబ్బంది, ప్రజలు కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# కంధి పంట సంరక్షణపై అవగాహన



మద్నూర్ :-(అక్టోబర్ -14) మనం -న్యూస్ :మద్నూర్ మండలం లోని మేనూర్ రైతు వేదిక యందు కెవికె రుద్రుర్ నుంచి వానకాలంలో సరఫరా చేసిన కంది డబ్ల్యూ ఆర్ జి-97 రకం కంది పంటపై రైతులకు కెవికె రుద్రుర్ శాస్త్రవేత్త ఇందుధర్ రెడ్డి , రైతులకు కంది పంటలో సస్యరక్షణ చర్యలు తెలపడం జరిగింది. అలాగే రైతులకు కంది పంటకు పిచికారి కోసం వేప నూనె ఇవ్వడం జరిగింది. మండల వ్యవసాయ అధికారి రాజు మాట్లాడుతూ యాసంగిలో సాగు చేయబోయే పంటల యాజమాన్య పద్ధతులు , విత్తన సబ్సిడీ వివరాలు, అలాగే ఎల్ నినో ప్రభావం గురించి రైతులకు వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్ పటేల్, ఉప సర్పంచ్, ఏఈవో విశాల్ గౌడ్. రైతులు పాల్గొన్నారు.




# సేవా కార్యక్రమాల విస్తరణకు రెడ్క్రాస్ కార్యాచరణ

**- కలెక్టర్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల నిర్వహణకు నిర్ణయం.**

**- ఈ నెల 16న నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం, కార్యక్రమానికి కలెక్టర్, ఎస్పీ హాజరు.**

కామారెడ్డి, అక్టోబరు 14(మనం న్యూస్): ఇండియన్ రెడ్క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని నూతన సభ్యుల జనరల్ బాడీ సమావేశంలో నిర్ణయించారు. బుధవారం కామారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో భవిష్యత్తులో చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలు, వాటి అమలుపై చర్చించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి సేవా కార్యక్రమంలో ముందుండి, రాష్ట్రస్థాయిలో రెడ్క్రాస్ సొసైటీకి మంచి గుర్తింపు తీసుకురావాలని సభ్యులు నిర్ణయించారు. ఈ సందర్భంగా రెడ్క్రాస్ జిల్లా చైర్మన్ సంజీవరెడ్డి, రాష్ట్ర ఎంసీ సభ్యుడు డాక్టర్ ఎం. జైపాల్రెడ్డి మాట్లాడుతూ., నూతన కార్యవర్గం సమష్టి కృషితో సేవా కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని పేర్కొన్నారు. కామారెడ్డి రెడ్క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈ నెల 16న శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రెడ్క్రాస్ జిల్లా అధ్యక్షుడు, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ హాజరుకానున్నట్లు వెల్లడించారు. సమావేశంలో వైస్ చైర్మన్ దస్తిరాం, కోశాధికారి రమేశ్రెడ్డి, మాజీ చైర్మన్ రాజన్నతోపాటు రెడ్క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

# లో వోల్టేజీతో రైతుల విలవిల.. విద్యుత్ సమస్యపై బీజేపీ రాస్తారోకో!

**మోటార్లు కాలిపోతున్నాయి.. పంటలు ఎండిపోతున్నాయి**

**విద్యుత్ అధికారుల తీరుపై రైతులు, బీజేపీ నాయకుల ఆగ్రహం**

ఆర్మూర్, అక్టోబర్ 14 (మనం న్యూస్): ఆర్మూర్, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని, పంట పొలాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు శేషగిరి లింగం ఆధ్వర్యంలో రైతులు, బీజేపీ నాయకులు కలిసి కెనాల్ బ్రిడ్జిలపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరాలో నెలకొన్న లో వోల్టేజీ సమస్యపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.లో వోల్టేజీ కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని, విద్యుత్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సక్రమంగా కరెంటు సరఫరా లేక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని, సాగు చేసిన పంటలను కాపాడుకోవడం కష్టంగా మారిందని వాపోయారు. ఈ సమస్యను పలుమార్లు ప్రభుత్వ, విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించకపోవడంతోనే రాస్తారోకో చేపట్టినట్లు తెలిపారు.



**ఒక సమస్య తీరకముందే మరో సమస్య..**

మొన్నటి వరకు యూరియా కొరతతో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు, ఇప్పుడు విద్యుత్ సమస్యతో సతమతమవుతున్నారని బీజేపీ నాయకులు విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతోందని, వరుస ఇబ్బందులతో రైతుల నడ్డి విరుస్తోందని మండిపడ్డారు. తక్షణమే లో వోల్టేజీ సమస్యను పరిష్కరించి, వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

**అధికారుల హామీతో రాస్తారోకో విరమణ**

రాస్తారోకో విషయం తెలుసుకున్న పోలీసు, విద్యుత్ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. లో వోల్టేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, రైతుల పంటలకు అవసరమైన విద్యుత్ సరఫరా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రైతు రాష్ట్ర నాయకులు కలిగోట గంగాధర్, నూతుల శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు యామాద్రి భాస్కర్, పోల్కం వేణు, చిట్టి బాజన్న, బీజేపీ కౌన్సిలర్లు అన్నారం రాజు, పోచంపల్లి శ్రీనివాస్, శ్రవణ్ గౌడ్, నాయకులు దొండి ఈశ్వర్, పులి యుగేందర్, మిర్యాలకర్ కిరణ్, కలిగోట ప్రశాంత్, ఉదయ్ గౌడ్, తోట నారాయణ, రుద్ర శ్రీనివాస్ తదితరులతో పాటు రైతులు పాల గంగాధర్, నారాయణపేట రాజకుమార్, రాజేందర్, పాల నాగరాజు, బోగోడ మీది చిన్న బాజన్న, మల్లయ్య, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



# కుల ధ్రువీకరణ పత్రంపై సమగ్ర విచారణ జరపాలి

ఆర్మూర్, అక్టోబర్ 14 (మనం న్యూస్): ఆర్మూర్ మున్సిపల్ ఎన్నికల్లో 8వ వార్డు కౌన్సిలర్ డిచ్ పల్లి శారద, నకిలీ కుల ధ్రువీకరణ పత్రంతో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేశారని ప్రస్తుతం కౌన్సిలర్ గా కొనసాగుతుంది అని ఆరోపిస్తూ, ఆమె కుల ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ నాయకుడు తోపారం భగత్ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై హైకోర్టు ఆదేశాల మేరకు సమగ్ర విచారణ జరపాలని కోరారు. సంబంధిత అధికారులకు పలుమార్లు వినతులు ఇచ్చినా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, స్థానిక తహసీల్దార్ స్పందించి నిష్పక్షపాతంగా విచారణ జరపాలని, లేనిపక్షంలో సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చెరుకు శ్రీనివాస్, సాయికుమార్ పాల్గొన్నారు.

# బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యవర్గం ఏర్పాటు

**- మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా కామారెడ్డి 35వ వార్డు కౌన్సిలర్ వినోద పాటిల్.**

**- 22 మందితో నూతన కమిటీ ఏర్పాటు: జిల్లా అధ్యక్షురాలు పావని రెడ్డి వెల్లడి.**



కామారెడ్డి, అక్టోబరు 14(మనం న్యూస్): బీజేపీ కామారెడ్డి జిల్లా మహిళా మోర్చా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు ఆదేశాల మేరకు మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ పావని రెడ్డి 22 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ నియామకాలు తక్షణమే అమలులోకి వస్తాయని ఆమె తెలిపారు. నూతన కార్యవర్గంలో కామారెడ్డి మున్సిపాలిటీ 35వ వార్డు కౌన్సిలర్ వినోద పాటిల్, బిచ్కుందకు చెందిన రాథోడ్ సునీత జిల్లా ప్రధాన కార్యదర్శులుగా నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా మాచారెడ్డికి చెందిన హారిక, ఎల్లారెడ్డికి చెందిన సుజాత, బాన్సువాడకు చెందిన రేణుకా గౌడ్కు అవకాశం కల్పించారు. జిల్లా కార్యదర్శులుగా కామారెడ్డికి చెందిన వినీల, కవిత, ఎల్లారెడ్డికి చెందిన రజిత, బాన్సువాడకు చెందిన ఐశ్వర్య నియమితులయ్యారు. వీరిలో వినీల ప్రస్తుతం రాఘవాపూర్ సర్పంచ్గా కొనసాగుతున్నారు. జిల్లా కోశాధికారిగా సుశీల, మీడియా కన్వీనర్గా దోమకొండకు చెందిన సుజాత, సోషల్ మీడియా కన్వీనర్గా సునంద, ఐటీ కన్వీనర్గా అంకిత, కార్యాలయ కార్యదర్శిగా లక్ష్మిని నియమించారు. ఇతర పదవుల్లోనూ పలువురికి బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో మహిళా మోర్చా సంస్థాగత కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

**ఎస్సీ మోర్చా నూతన సారథులు: రేవన్**

కామారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా నూతన కార్యవర్గాన్ని ఆ విభాగం జిల్లా అధ్యక్షుడు రేవన్ అధికారికంగా ప్రకటించారు. కమిటీ ఉపాధ్యక్షులుగా దండు రాజు, సంది సాయిరాం, గంట మధు (కామారెడ్డి), ఎస్. లక్ష్మి (బాన్సువాడ) నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా కామారెడ్డికి చెందిన సుంకరి నరేష్, స్వామిలకు బాధ్యతలు అప్పగించారు.

కార్యదర్శులుగా మారుతి (జుక్కల్), రంజిత్ (బాన్సువాడ), మాల సుభాష్, మాస్ శ్రీనివాసులు (కామారెడ్డి) ఎంపికయ్యారు. కోశాధికారిగా పాతల సాలమయ్య, మీడియా కన్వీనర్గా మల్లేపల్లి సంతోష్, సోషల్ మీడియా కన్వీనర్గా మైత్రి నియమితులయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా దామిని రాములు, మీసాల లక్ష్మణ్, ఎర్రదుర్గయ్య, నమివార్ విఠల్, బాబు మహారాజ్ నియమితులయ్యారని, ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని రేవన్ తెలిపారు.

# భైరవ సేన వార్షికోత్సవంలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

**- భైరవ సేన రెండో వార్షికోత్సవ వేడుకలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్రెడ్డి.**

కామారెడ్డి, అక్టోబరు 14 (మనం న్యూస్): భైరవ సేన రెండో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన దుర్గాదేవి పూజా కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. భైరవ సేన మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు సేవలందించాలని, ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా సమాజంలో భక్తిభావాన్ని పెంపొందించాలని కోరారు.



**ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత**

ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యతను, సానుకూల ఆలోచనలను పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో పలువురు నాయకులు, భైరవ సేన సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి మాజీ మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియ, కామారెడ్డి నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడు మెహర్ బాబా గౌడ్ అరవింద్, భైరవ సేన నిర్వాహకులు, సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# నీలా గ్రామంలో వైభవంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

**శ్రీ మహాచండి (కూష్మాండ) దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు...**

**ఆధ్యాత్మికతతో పాటు హిందూ ధర్మ సంప్రదాయాలపై చైతన్యం..**

**బుర్రకథతో అలరించిన కళాకారులు...**



రెంజల్, అక్టోబర్ 14 (మనం న్యూస్): రెంజల్ మండలంలోని నీలా గ్రామంలో దేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శ్రీ మహాచండి (కూష్మాండ) దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వడంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శ్రీ మహాచండి దేవి దర్శనంతో భక్తిపారవశ్యం.,**

దేవి నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో నాలుగో రోజు శ్రీ మహాచండి (కూష్మాండ) దేవి రూపంలో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తితో పూజలు నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

**కనుమరుగవుతున్న సంప్రదాయ కళలకు జీవం పోస్తున్న బుర్రకథ.,**

ప్రస్తుత కాలంలో పాతకాలపు జానపద కళలు, సంప్రదాయ కళారూపాలు క్రమంగా కనుమరుగవుతున్న నేపథ్యంలో వాటిని కాపాడుతూ భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో దేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేకంగా బుర్రకథ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు తమ ప్రదర్శనతో గ్రామ ప్రజలను ఆకట్టుకున్నారు.



బుర్రకథ ద్వారా హిందూ ధర్మంలోని ఆచారాలు, సంప్రదాయాలు, పూర్వకాలపు నాగరికత, జీవన విధానాలను వివరిస్తూ సమాజంలో ప్రతి ఒక్కరూ ఎలా నడుచుకోవాలి, మంచి నడవడికను ఎలా అలవర్చుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. కథలు, పాటలు, సంభాషణల ద్వారా సామాజిక విలువలను ప్రజలకు చేరవేస్తూ గ్రామస్తుల్లో చైతన్యం తీసుకువచ్చారు.

**ధర్మం, సంస్కృతి, సామాజిక విలువలపై అవగాహన.,**

బుర్రకథ వంటి సంప్రదాయ కళారూపాలు కేవలం వినోదానికే పరిమితం కాకుండా సమాజానికి మంచి సందేశాన్ని అందిస్తాయని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. పూర్వీకుల నుంచి వస్తున్న ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలకపాత్ర పోషిస్తాయని గ్రామస్తులు పేర్కొన్నారు. దేవి ఉత్సవాల సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం పట్ల కమిటీ సభ్యులను పలువురు అభినందించారు.

**ఉత్సవాల్లో పాల్గొన్న ప్రముఖులు.,**

ఈ కార్యక్రమంలో నీలా గ్రామ సర్పంచ్ క్యాతం యోగేష్, దేవి ఉత్సవ కమిటీ సభ్యులు స్నేహిత్, నవీన్, నాగభూషణ్, అశోక్, సాయినాథ్, శివ, నాయకులు రాఘవేందర్, రవి, బండారి గంగాధర్తో పాటు గ్రామ ప్రజలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు కృషి చేస్తున్నారు.

---



## కామారెడ్డి బీజేపీ మహిళా మోర్చా జిల్లా జనరల్ సెక్రెటరీగా రాథోడ్ సునీత

బిచ్కుంద అక్టోబర్ 14 మనం న్యూస్: భారతీయ జనతా పార్టీ కామారెడ్డి జిల్లా మహిళా మోర్చా జిల్లా జనరల్ సెక్రెటరీగా బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన రాథోడ్ సునీత నియమితులయ్యారు.

బీజేపీ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు నీలం చిన్నరాజులు ఆదేశాల మేరకు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పావని రెడ్డి రాథోడ్ సునీతను జిల్లా జనరల్ సెక్రెటరీగా ప్రకటించారు.

పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ మహిళా మోర్చాను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని రాథోడ్ సునీత తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## దుర్గా దేవి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా బోనాల ఉత్సవం

మెండోరా, అక్టోబర్ 13 (మనం న్యూస్): నిజామాబాద్ జిల్లా మెండోరా మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో దుర్గా దేవి సేవా సమితి ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. ఉత్సవాల సందర్భంగా కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు ఉత్సాహంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

దుర్గా దేవి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బోనాల ఉత్సవం భక్తుల సందడితో వైభవంగా సాగింది



## యాసింగిలో వరి వేయవద్దు

**మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి.**

సదాశివనగర్, అక్టోబర్ 14(మనం న్యూస్): మండలంలోని వజ్జేపల్లి తండాలో రైతులు సాగు చేసిన పంటలను మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులకు వరి,పత్తి పంటల్లో చీడపీడాల గురించి అవగాహన కల్పించారు.ఏలినో ప్రభావం వల్ల రాబోయే యాసంగి కాలంలో వరి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని రైతులను సూచించారు.వరికి బదులుగా జొన్న,సెనగ,పెసర,కుసుమ,సజ్జ వంటి పంటలు సాగు చేసుకోవాలని కోరారు.

